అంధకారంలో కేసీఆర్‌నగర్ కాలనీ

తంగళ్లపల్లి, ఆగస్టు 21: తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్ కాలనీలో కొద్దిరోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. కేసీఆర్‌నగర్ ప్రధాన ద్వారం ముందు, కాలనీలో వీధి దీపాలు వెలగక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు, సెస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చేయాలని కోరుతున్నారు.

ముందుకు సాగని మిల్లింగ్

- నత్తనడకన లెవీ బియ్యం సేకరణ
- 2023-24 వానాకాలం సీజన్‌లో 68,619 మెట్రిక్ టన్నులు
- రబీలో 1,22,358 మెట్రిక్ టన్నులు పెండింగ్
- పర్యవేక్షిస్తున్న పౌరసరఫరాల అధికారులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ నత్తనడకగానే సాగుతోంది. ప్రతి సీజన్‌లో నూ బియ్యం రికవరీ కోసం పౌరసరఫరాల శాఖ సీరియస్‌గా వ్యవహరించడం జరిమానాల వరకు వెళ్లడం పరిపాటిగానే మారిపోతుంది. ప్రతిసారి ఇచ్చిన గడువులోపు లక్ష్యం మేరకు రైస్‌మిల్లర్లు బి య్యం ఇవ్వకపోవడం జరుగుతూనే ఉంది. అధికారుల ఉదాసీనతే కారణంగా విమర్శలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2023 - 24 సంవత్సరానికి సంబంధించి వానాకాలం, రబీకి సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ విధానంలో బియ్యం సేకరిస్తున్నారు. రెండు సీజన్‌లకు సంబంధించి జిల్లాలో ఐకేపీ, సింగిల్ విండోలు, మార్కెట్ కమిటీలు, మె ప్మాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని జిల్లాలో వంద రైస్ మిల్లులకు అందించారు. ఇందుకు సంబంధించిన బియ్యాన్ని పౌర సరఫరాల శాఖకు అందించారు. కానీ ఇప్పటి వరకు సగం కూడా పూర్తి కాలేదు.

● లక్ష్యానికి దూరం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యానికి దూరంగానే ఉంది. ప్రభుత్వం మిల్లర్లకు క్వింటాలు ధాన్యం ఇస్తే మిల్లర్లు మరాడించి 67 కిలోల బియ్యాన్ని లేవీ రూపంలో తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. మిల్లర్లు సొంత వ్యాపారానికి ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో సీఎంఆర్ అందిం చడంలో జాప్యం జరుగుతుందనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో 2023-24 సంవత్స రానికి ఖరీఫ్, రబీకి సంబంధించి 3,09,026 మెట్రిక్ టన్నుల ధా న్యాన్ని సేకరిం చాల్సి ఉండగా 1,90,977 మెట్రిక్ టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉంది. గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 2,00,715 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లు లకు కేటాయించారు. దీని ద్వారా 1,34,861 మెట్రిక్ టన్నుల బియ్యం లేవీ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 66,903 మెట్రిక్ టన్నుల బి య్యాన్ని ఇచ్చారు. 68,619 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉంది. ఇందులో రా రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు 1,40,429 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 94,087 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 54,027 మెట్రిక్ టన్నులు అందించారు. 40,597 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. బాయిల్డ్ రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు 38,286 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 11,919 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 12,354 మెట్రిక్ టన్నులు అందించారు. 13,799 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. రా రైస్‌మిల్లుల ద్వారా పౌరసరఫరాల కార్పొరేషన్‌కు 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 14,740 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 522 మెట్రిక్ టన్నులు అందించారు. 14,222 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. గత యాసంగి సీజన్‌కు సంబంధించి మిల్లులకు 2,56,126 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అందించారు. వీటి ద్వారా 1,74,165 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీఎంఆర్ ద్వారా సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 52,288 మాత్రమే సేకరించారు. 1,22,358 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాల్సి ఉంది. ఇప్పటివరకు బాయిల్డ్ రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు 7,499 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 5,099 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 5,075 మెట్రిక్ టన్నులు అందించారు. 34 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. బాయిల్డ్ రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు (ఎఫ్‌ఆర్‌కే) 2,14,920 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 1,46,145 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా 47,212 మెట్రిక్ టన్నులు అందించారు. 99,403 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. రా రైస్‌మిల్లుల ద్వారా ఎఫ్‌సీఐకు 33,520 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 22,793 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు బియ్యాన్ని అందించలేదు.



జిల్లాలోని మిల్లుల్లో నిల్వ చేసిన ధాన్యం

మిల్లర్లకు ఇబ్బందులే...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి, ఖరీఫ్ సీజన్‌లలో ధాన్యం అలాట్‌మెంట్ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మిల్లర్లు వాపోతున్నారు. క్వింటాల్ ధాన్యానికి 67 కిలోలు కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వాల్సి ఉంటుంది. వచ్చిన ధాన్యం మాయిశ్చర్ సరిగా ఉండడం లేదని దీని ద్వారా క్వింటాలుకు 61 కిలోల వరకు బియ్యం వస్తుందని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో 58 కిలోల వరకు కూడా రావడం ద్వారా 6 నుంచి 9 కిలోల వరకు నష్టపోతున్నామని మిల్లర్లు చెబుతున్నారు. కస్టమ్ మిల్లింగ్ చార్జీలు కూడా గతంలో కంటే తగ్గించడం, గన్నీ బ్యాగులకు సంబంధించిన చార్జీలు, కరెంట్ బిల్లులు పెరగడం వల్ల నష్టపోతున్నామని మిల్లర్లు ఆవేదన చెందుతున్నారు.



మిల్లులో మరాడిస్తున్న బియ్యం

పిచ్చిమొక్కలు తొలగించిన పోలీసులు

ఇల్లంతకుంట, ఆగస్టు 21: వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం తొలగించారు. ఇల్లంతకుంట నుంచి సిరిసిల్లకు వెళ్లే మార్గంలో రోడ్డుపైకి చెట్ల కొమ్మలు వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు జేసీబీని తీసుకవచ్చి పిచ్చి మొక్కలు తొలగించారు. పోలీసుల చర్యలపట్ల వాహనదారులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 21: సిరిసిల్ల పట్టణం 34వ వార్డులో బుధవారం వార్డు కౌన్సిలర్ దార్ల కీర్తనసందీప్ సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. వార్డుకు చెందిన లబ్ధిదారులు ఓరగంటి రాజమణి రూ. 16500, ఓర్సు రోహిత్‌చందర్ రూ. 19500లు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దార్ల సందీప్, వార్డు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. గ్రామంలోని జల్లి పద్మకు రూ.15 వేలు, బత్తుల రాములుకు రూ. 30 వేలు, రాగి శ్రీనివాస్‌కు రూ.15 వేలు, రమేశ్‌కు రూ 17.5 వేలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దేవరెడ్డి, సత్యం, సతీష్‌రెడ్డి, అశ్వాక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను సాధిస్తాం



సభ్యత్వాలను స్వీకరిస్తున్న సంఘ నాయకులు

ఇల్లంతకుంట, ఆగస్టు 21: ఉపాధ్యాయుల చిరకాల స్వప్నం సర్వీస్‌రూల్స్‌ను త్వరలోనే సాధిస్తామని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మ్యాడం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గాలిపెల్లి, నర్సక్కపేట, పొత్తూరు, కందికట్కూర్, వెల్జిపూర్ తదితర పాఠశాలలో బుధవారం సభ్యత్వాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి నాయకత్వంలో ఉపాధ్యాయుల సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెంచాల సత్యనారాయణ, గొనె సత్యం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి రాధిక జస్వాల్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధికా జస్వాల్

తంగళ్లపల్లి,ఆగస్టు21: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకుని న్యాయం పొందాలని సీనియర్ సివిల్ జడ్జి రాధిక జస్వాల్ సూచించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం మండపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. వృద్ధులకు న్యాయపరమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే వారి ఆరోగ్య సమస్యలు, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. వారికోసం వండిన వంటలను పరిశీలించారు. వారితో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో మెంబర్ చింతోజి భాస్కర్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీజేపీ కార్యకర్త కొంపెల్లి రాజు కుటుంబానికి ఆ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం 50 కిలోల బియ్యం వితరణ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రవి, నాగరాజు, నరేశ్, భాను, అజయ్, సంతోష్, ఆంజనేయులు, సతీష్, బాబు, శివ, ఆనందం, బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● కలెక్టర్‌కు మాజీ సర్పంచ్‌ల వినతి

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 21: గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించి తమను ఆదుకోవాలంటూ మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు బుధవారం జిల్లాలోని అన్నిమండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు తరలివచ్చి కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి సమస్యలను విన్నవించారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ల ఫోరం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అప్పులు చేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేయడంతో పదవీకాలం ముగిసిందన్నారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జేఏసీ అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, ఉపాధ్యక్షురాలు గడప శివజ్యోతి, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, కోశాధికారి మెన్నమనేని వంశీకృష్ణరావు, కార్యదర్శులు ఊరడి రాంరెడ్డి, చల్ల నారాయణ, సంయుక్త కార్యదర్శులు వలకొండ వేణుగోపాల్‌రావు, కోల నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు మంతెన సంతోష్, బూ ర్గుల నందయ్య, సిరికొండ శ్రీనివాస్, తర్రె మనోహర్ పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే రుణమాఫీపై ధర్నాలు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 21: రాజకీయ లబ్ధి కోసమే రుణమాఫీపై ధర్నాలు చేస్తున్నారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 27వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలన్నారు. 10 సంవత్సరాల ప్రజా వ్యతిరేక, నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడి ప్రజాపాలన కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజా సమస్యలపై అర్జీలు తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు పోతున్నామని, దేశ చరిత్రలోనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేశామన్నారు. ఆనాడు ధనిక రాష్ట్రమని చెప్పి అధికారంలోకి వచ్చాక రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఏకకాలంలో చేసిన దాఖలాలు లేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో మొత్తం రైతు రుణమాఫీ 27 వేల కోట్లు చేస్తే కేవలం ఎనిమిది నెలలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 31 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశామని, దీన్ని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ నాయకులు రోడ్లకి వచ్చి ధర్నా చేస్తున్నారని అన్నారు. తనకు ఎమ్మెల్యే పదవి రాకరాక వచ్చిందని కొందరు అంటున్నారని, మీలాగా ఎమ్మెల్యే పదవి లేకుంటే విదేశాల్లో ఉండడం లేదని, పట్నంలో ఉండలేనని గెలిచినా, ఓడినా ప్రజల మధ్యలో ఉన్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాగరం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, చిలుక రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వేములవాడలో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కేజీబీవీ బదిలీల్లో నిబంధనలు పాటించాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 21: కస్తూర్బా విద్యాలయాల ఉపాధ్యాయినిల బదిలీలల్లో కనీస అర్హతగా రెండు సంవత్సరాలు నిర్ణయించినప్పుడు గరిష్ట పరిమితి కూడా ఎందుకు విధించడం లేదని టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు దోర్నాల భూపాల్ రెడ్డి, దుమాల రమానాథ్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేజీబీవీలో పని చేసే ఉపాధ్యాయులు గత 15 సంవత్సరాలుగా సుదూర ప్రాంతాలలో ఇబ్బందులు పడుతూ పనిచేస్తున్నారని అందుకే ఈ రోజు వెలువడిన బదిలీల షెడ్యూల్లో ఎనిమిది సంవత్సరాలు ఒకే చోట పనిచేసిన వారికి తప్పనిసరి బదిలీలు చేపట్టాలని అన్నారు. లేనిచో ఈ బదిలీలు కొందరికే ప్రయోజనకారిగా ఉంటాయని అన్నారు. అలాగే కేజీబీవీలలో పనిచేస్తున్న వృత్తి విద్యా శిక్షకులకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్ల రూరల్, అగస్టు 21: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకోసం మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ మధ్యాహ్న భోజనరంగం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ మధ్యాహ్న భోజనరంగం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికులకు రావాల్సిన కోడిగుడ్ల బిల్లు, గత సంవత్సరం అక్టోబర్ మాసం నుంచి ఇప్పటివరకు మధ్యాహ్న భోజనం వంట కార్మికులకు చెల్లింపులు యాధావిధిగా లేవన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నెలకు రూ.200 వేతనం నాలుగు నెలలుగా విడుదల చేయడం లేదన్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన కార్మికుల పొట్ట కొట్టేవిధంగా హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా వంటల తయారీ ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చి 8నెలలు గడుస్తున్నా ఇంతవరకు రూ.10వేల వేతనం ఇవ్వడం లేదన్నారు. . ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయడంతో పాటు సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు బాలమణి, కవిత, బాబాయ్, గంగయ్య, నర్సవ్వ, దేవయ్య, లచ్చవ్వ, దేవవ్వ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న మధ్యాహ్నభోజన కార్మికులు

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 21: ప్రతిభావంతులైన బాలబాలికలను సత్కరించేందుకు భారత ప్రభుత్వం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ - 2024 అవార్డులను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానించిందని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులను నిస్వార్థమైన సేవలు చేసిన యువ, బాలబాలికలకు వ్యక్తిగత హోదాలో బాల బాలిక అభ్యున్నతికి కృషిచేసిన సంస్థలకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 5 నుంచి 18 సంవత్సరాల వయస్సు లోపు బాల బాలికలు అర్హులని ఇందుకోసం ధైర్యసాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ పర్యావరణం, కళలు, సాంస్కృతిక తదితర రంగాల్లో ప్రతిభ కనబర్చిన బాలబాలికలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చేసుకోవాలని వివరాల కోసం జిల్లా కలెక్టరేట్‌లోని సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని లక్ష్మీరాజం కోరారు.

వేములవాడ ఏడీఏగా రామారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడీఏ రామారావు

వేములవాడ రూరల్, ఆగస్టు: వేములవాడ వ్యవసాయ సహాయ సంచాలకులుగా రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చొప్పదండి నుంచి వేములవాడకు బదిలీపై వచ్చిన ఆయన బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ శాఖ అధికారి సాయికిరణ్, సిబ్బంది ఏడీఏను మర్యాద పూర్వకంగా కలిశారు. వేములవాడ ఏడీఏగా పనిచేసిన భాస్కర్ నిర్మల్‌కు బదిలీ అయ్యారు.

వస్త్ర పరిశ్రమలో స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, అగస్టు 21: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమల్లో స్థానిక కార్మికులకు పనులు కల్పించకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు పనులు కల్పిస్తున్న పరిశ్రమలకు ప్రభుత్వ ఆర్డర్‌లను ఇవ్వవద్దని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, కార్యదర్శి మూషం రమేష్‌లు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని చేనేత జౌళీశాఖ కార్యాలయంలో బుధవారం ఏడీ మిట్టకోల సాగర్‌ను సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం వలన గత కొన్ని నెలలుగా మరమగ్గాల పరిశ్రమలు సరిగా పనిచేయడం లేదని అన్నారు. దీంతో కార్మికులకు ఉపాధికూడా తగ్గిపోయిందని సరిగా ఉపాధి లేకపోవడంతో ఈమధ్యకాలంలో దాదాపు 10 మంది కార్మికులు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడారని అన్నారు. ప్రస్తుతం కొంత మంది యజమానులు స్థానిక ఉంటున్న మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించకుండా ఇబ్బందులకు గురిచేయడంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను పనుల్లో పెట్టుకుంటున్న వస్త్ర పరిశ్రమల యాజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. వారికి ఇచ్చే ప్రభుత్వ ఆర్డర్‌లను ఇవ్వకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టి విద్యుత్, ఇతర సబ్సిడీలను తొలగించి ప్రభుత్వ పరంగా ఎలాంటి లబ్ధి చేకూర్చవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చేరాల రవి, కందుకూరి రమేష్, ఎలిగేటి రాజశేఖర్, అన్నల్‌దాస్ గణేష్,నక్క దేవదాస్ ఉన్నారు.



సిరిసిల్లలో ఏడీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 21: రైతులను రుణవిముక్తులను చేయడంతో పాటు రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని రుణవిముక్తులను చేసేందుకు వరంగల్ డిక్లరేషన్ సభలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా అధికారంలోకి వచ్చిన కేవలం 8-9 మాసాల్లోనే రైతు రుణమాఫీ చేసి చూపించిందన్నారు. ఇప్పటికే జూలై 18నుంచి ఆగస్టు 15వరకు 18వేల కోట్ల రూపాయలతో రెండు లక్షల లోపు రుణం ఉన్న రైతుల రుణాలను మాఫీ చేసిందని తెలిపారు. సాంకేతి కారణాల వల్ల కొందరు రైతులకు మాఫీ కాకపోవడంతో ఆందోళన చెందు తున్నారని, తమ ఆధార్ కార్డు ద్వారా రుణమాఫీ అర్హత తెలుసుకొని సమ స్యను పరిష్కరించుకోవడం ద్వారా మాఫీ వర్తిస్తుందన్నారు. రెండు లక్షల పైచిలుకు రుణాల్లో కూడా ఆపై మొత్తాన్ని చెల్లించి రెండు లక్షల వరకు రుణం పొందే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏక కాలంలో రూ.1లక్ష రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వానికి రైతు రుణాలను మాఫీ చేయాలనే ఆలోచన లేకపోవడం దురదృష్టకరమన్నారు. కేవలం అంబానీ, అదానీల రుణవిముక్తికి కృషి చేస్తుంది తప్ప రైతు రుణాల మాఫీకి కాదన్నారు. రేషన్‌కార్డు లేని వారికి కూడా అధికారుల విచారణ అనంతరం మాఫీ వర్తిస్తుందని ఆందోళన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అర్హత ఉండి, సాంకేతిక కారణాలతో రుణమాఫీ వర్తించని వారి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రతిపక్షాలు రైతులకు గైడ్‌గా నిలవాలి తప్ప, రెచ్చ గొట్టడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాలుగు విడతల్లో చేసిన లక్ష రూపాయల రుణమాఫీ పథకం కేవలం వడ్డీ మాఫీ పథకంగా మారిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్, బ్లాక్ ప్రెసిడెంట్ పొలాస నందయ్య, మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ ఎంపీపీ రమేష్‌బాబు, నాయకులు గుంటి జగదీశ్వర్, భాస్కర్‌రావు, షేక్ చాంద్ పాషా, పొగల్ల శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

గాంధేయ మార్గంలో సామాజిక కార్యకర్త పాదయాత్ర

అభివృద్ధిపై సీఎంను కలిసేందుకు హైదరాబాద్‌కు పయనం

భగత్‌నగర్, ఆగస్టు 21:తమ ప్రాంత అభివృద్ధి పై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించుకునేందు కు ఓ సామాజిక కార్యకర్త గాంధేయమార్గంలో పాదయాత్ర చేపట్టాడు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణికి చెందిన పెందోర్ ధర్ము అనే సామాజిక కార్యకర్త గాంధీ వేషధారణతో పాదయాత్రగా బయలు దేరి కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధిపై విన్నవించేందుకు గాంధేయ మార్గంలో పాదయాత్ర చేపట్టినట్లు ధర్ము తెలిపారు.


మహాత్మాగాంధీ వేషధారణలో ధర్ము

పురుగుల మందు తాగి మహిళ మృతి


సరోజన (ఫైల్)

ఇల్లందకుంట, ఆగస్టు 21:మండలంలోని టేకుర్తికి చెందిన శ్రీరాముల సరోజన (58) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరోజన వారం రోజులుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తుంది.ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అదే రోజు రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. సరోజన భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

శంకరపట్నం, ఆగస్టు 21: మండలంలోని అంబాలపూర్‌లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు నాటు సార తయారీ స్థావరాలపై బుధవారం దాడి చేశారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ కరీంనగర్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. బెల్లం పానకం ధ్వంసం చేశారు. గొల్లెన కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు..: ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం: మండల కేంద్రం సమీపంలో కరీంనగర్- వరంగల్ రహదారిపై బుధవారం బైక్‌ను కారు ఢీకొంది. మండలంలోని ఆముదాలపల్లికి చెందిన ఆకునూరి తిరుపతిరెడ్డి బైక్‌పై వెళుతుండగా కారు ఢీకొట్టడంతో రోడ్డు పక్కకు పడిపోయాడు. తిరుపతిరెడ్డి కాలుకు తీవ్రగాయాలయ్యాయి.

టేకుచెట్ల నరికివేతపై డీఎఫ్‌వో విచారణ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో టేకు చెట్ల నరికివేతపై విచారణకు వెళ్లిన డీఎఫ్‌వో బాలమణి ఆధ్వర్యంలోని అధికారులను బుధవారం రైతులు అడ్డుకున్నారు. అటవీ ప్రాంతంలోని నరికిన చెట్లను అధికారులు పరిశీలించి సోదాలు నిర్వహించారు. గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటిలో నిల్వ చేసిన పాత కలపను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధమవడంతో రైతులు

పోతిరెడ్డిపల్లిలో అధికారులను అడ్డుకున్న రైతులు

అధికారులతో వాగ్వాదానికి దిగారు. గ్రామ శివారులోని అటవీ సమీపాన ఉన్న 20 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 21 మందికి చెందిన పట్టా భూమిలోని టేకు చెట్లను గత యేడాది నరికి వేస్తే ప్రస్తుతం కలపను ఎందుకు స్వాధీన పర్చుకుంటారని అధికారులను నిలదీశారు. సుమారు మూడు గంటల పాటు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. రైతులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఓ వ్యక్తి ఇంటిలో నిల్వచేసిన పురాతన కలపను స్వాధీన పర్చుకుంటామని అటవీశాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కలపను తరలిస్తే ఊరుకోబోమని అడ్డుకున్నారు. అటవీశాఖ అధికారులు ఇతర గ్రామం నుంచి వాహనాన్ని తీసుకువచ్చి కలపను సిరిసిల్ల అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కలప విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. అనుమతి లేకుండా టేకు చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎఫ్‌వో బాలమణి హెచ్చరించారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి)/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,067 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.276 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 17 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.59 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో 2.66 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు నుంచి 3,200క్యూసెక్కుల నీటిని ఒక పంప్ ద్వారా ఎత్తిపోస్తుండగా సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు నీటి విడుదలను నిలిపివేశారు.

మద్యం మత్తులో యువకుడి హత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21: మద్యం మత్తులో గొడవతో కరీంనగర్ అశోక్‌నగర్‌లోని దుర్గమ్మగడ్డ ఉర్దూమీడియం స్కూల్ ఆవరణలో కొత్తగా నిర్మిస్తున్న భవనం మూడో అంతస్థులో అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ ముజాయిద్‌ఖాన్ (32) మంగళవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. ముజాయిద్‌ఖాన్‌ను అశోక్‌నగర్‌కు చెందిన మీర్జా సుఫియాన్‌బేగ్ హత్య చేశాడని కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. సీఐ, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ముజాయిద్‌ఖాన్‌కు వివాహం జరిగినప్పటికీ భార్య అతడితో కలిసి ఉండడం లేదు. ఆటో నడుపుతూ, పూలు అమ్ముతూ జీవిస్తున్న ముజాయిద్ ఖాన్ ఒంటరిగానే అశోక్‌నగర్‌లో ఉంటున్నాడు. మంగళవారం రాత్రి బంధువుల వద్ద భోజనం చేసిన ముజాయిద్‌ఖాన్ మద్యం సేవించి దుర్గమ్మగడ్డలోని స్కూల్ భవనంపై ఇసుకలో పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో అక్కడే సమీపంలో హోటల్‌లో పని చేస్తున్న మీర్జాసుఫియాన్‌బేగ్ అదే భవనంపైకి చేరుకుని నిద్రకు ఉపక్రమించాడు.



ముజాయిద్‌ఖాన్ (ఫైల్)

మద్యం విషయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ముజాయిద్ ఖాన్ ముఖంపై సిమెంట్ ఇటుకతో మీర్జా సుఫియాన్‌బేగ్ బాదాడు. తల, ముఖంపై తీవ్ర రక్త గాయాలతో ముజాయిద్ ఖాన్ అక్కడికక్కడే మరణించాడు. అయితే ఈ విషయాన్ని నిందితుడు స్థానికులతో రాత్రి చెప్పాడని, అయినప్పటికీ మద్యం మత్తులో అలాగే మాట్లాడుతాడని భావించారని పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం నిందితుడు తాను ఒకరిని హత్య చేశానని తన తండ్రికి చెప్పగా వెంటనే స్థానికులు భవనంపై చూడగా ముజాయిద్‌ఖాన్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సరిలాల్ వెంటనే మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రపరిచారు. అనంతరం విచారణ జరుపుతున్నారు. కాగా మృతుడు, నిందితుడు ఇద్దరు కూడా పాత నేరస్థులుగా తెలిసింది. హత్య చేసిన నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మద్యం మత్తులో చిన్న కారణంతో గొడవకు దిగగా హత్యకు దారితీసిందని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సరిలాల్ తెలిపారు.

సైబర్ నేరాల కోసం పాత ఫోన్ల కొనుగోలు

● ముగ్గురు వ్యక్తుల అరెస్టు ● నాలుగు వేల మొబైల్ ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్న సైబర్ పోలీసులు



మహ్మద్ షమీమ్, అబ్దుల్ సలాం, మహ్మద్ ఇఫ్తికార్

కోల్‌సిటీ, ఆగస్టు 21: సైబర్ నేరాల్లో వినియోగించేందుకు పని చేయని పాత మొబైల్ ఫోన్లను అక్రమంగా కొనుగోలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనరేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం గోదావరిఖని, మేడిపల్లి ఎన్టీపీసీ ఏరియాలో బీహార్‌కు చెందిన కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ సైబర్ నేరాల కోసం పాత మొబైల్ ఫోన్లను తక్కువ ధరకు ప్రజల నుంచి ప్లాస్టిక్ వస్తువులు లేదా డబ్బును ఇచ్చి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ఈ సమాచారం రామగుండం సీసీపీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిబ్బందికి అందగా సీసీపీఎస్ ఎస్‌హెచ్‌వో కృష్ణమూర్తి సిబ్బందితో వెళ్లి అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. బీహార్‌లోని హతియా దియారాకు చెందిన మహ్మద్ షమీమ్(30), అబ్దుల్ సలాం (28), మహ్మద్ ఇఫ్తికార్(32)ల నుంచి సుమారు 4వేల పాత మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రామగుండం, దాని చుట్టు పక్కల ప్రాంతం నుంచి నెల రోజులలో బీహార్‌కు తరలించాలనే ఉద్దేశం తో నిందితులు ప్రజల నుంచి తక్కువ ధరకు పాత మొబైల్ ఫోన్లను కొనుగోలు చేస్తున్నారని, అట్టి మొబైల్స్‌ను తమ గ్రామంలో నివసిస్తున్న సహచరుడికి అప్పగిస్తారని విచారణలో వెల్లడైందన్నారు. అసోసియేట్ ద్వారా జార్ఖండ్ రాష్ట్రంలోని జమ్తారా, దియోఘర్ తదితర ప్రాంతాలకు చెందిన సైబర్ నేరస్థులకు ఈ మొబైల్ ఫోన్లు సరఫరా అవుతాయని పేర్కొన్నారు. సైబర్ నేరస్థులకు విక్రయించే ముందు వారి సహచరుడు అక్తర్ ఈ మొబైల్ ఫోన్ల సాఫ్ట్‌వేర్, మదర్ బోర్డు, ఇతర భాగాలను రిపేర్ చేసి సైబర్ నేరస్థులకు ఇచ్చేవాడన్నారు. ఈ సైబర్ నేరస్థులు రిపేర్ చేసిన ఫోన్లను ఉపయోగించి మోసపూరితంగా సంపాదించిన డబ్బును అక్తర్, వారు పంచుకుంటారన్నారు. వీరిపై 318(4), 319(2), 61(2) బీఎన్‌ఎస్, 106 బీఎన్‌ఎస్‌ఎస్ యాక్ట్ సెక్షన్ 66(డీ)ఐటీ యాక్ట్-2008 కింద కేసు నమోదు చేసి తెలిపారు.

ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మవద్దు...

ప్రజలు తమ పాత మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మవద్దని, ఇవ్వొద్దని ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి సూచించారు. పాత ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయిస్తే వాటిని సైబర్ మోసాలకు ఉపయోగించే అవకాశం ఉందని, డివైజ్ ఐడెంటిటీ కారణంగా అమ్మకందారులు కూడా నేరాలకు పాల్పడే అవకాశం ఉందని అనుమానిస్తున్నారన్నారు. ప్రజలు తమ పాత ఫోన్లను విక్రయించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, ఒక వేళ అమ్మితే అమ్మకం దారులు కూడా నేరస్థులుగా పరిగణించబడుతారన్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు ఉన్న సంచులు

మల్లుపల్లి శివారులో చిరుత కలకలం

అడవి పంది పిల్లలపై దాడి

గంభీరావుపేట ఆగస్టు 21: రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లుపల్లి, గోరంటాల గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన బ్రిడ్జి సమీపాన చిరుత అడవి పంది పిల్లలపై దాడికి తెగబడింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగినట్టు ఫారెస్టు అధికారులు ధ్రువీకరించారు. మల్లుపల్లి గోరంటాల మధ్య ఉన్న బ్రిడ్జి సమీప ప్రాంతంలో అడవిపంది పిల్లలను చిరుత చంపేసింది. ఆ ప్రాంతంలో చిరుత అడుగులతో పాటు చనిపోయిన అడవి పంది పిల్ల ఉండడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దమ్మన్నపేట, గోరంటాల, ముచ్చర్ల అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న వ్యవసాయ పొలాల వద్ద చిరుత దాడి చేస్తూ మూగజీవాలను చంపేస్తుంది. మండలంలో ఇప్పటికే వరుస సంఘటనలు జరిగి, ఐదుకు పైగా మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. మల్లుపల్లి, గోరంటాల మధ్య చిరుత సంచరిస్తుండడంతో సమీప గ్రామస్థులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీకి రికార్డు ఆదాయం

కరీంనగర్ రీజియన్‌లో రూ.9.63 కోట్ల రాబడి

భగత్‌నగర్, ఆగస్టు 21: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కరీంనగర్ రీజియన్‌కు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరిందని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్. సుచరిత తెలిపారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల్లో కరీంనగర్ రీజియన్‌కు 9 కోట్ల 63 లక్షల 46 వేల రూపాయల ఆదాయం సమకూరిందన్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోల్లో రీజియన్ వ్యాప్తంగా 12,18, 192 కిలోమీటర్ల మేర బస్సులను తిప్పామన్నారు. మొత్తం 17,09,620 మంది ప్రయాణికుల్లో 12,05, 396 మంది మహాలక్ష్మి ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారన్నారు. రీజియన్ వాప్తంగా ఆదాయాన్ని ఆర్జించుడంలో సహకరించిన ప్రయాణికులకు రీజినల్ మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత

జ్వరంతో వృద్ధుడి మృతి

గన్నేరువరం, ఆగస్టు 21: మండలంలోని పారువెల్ల గ్రామానికి చెందిన పిట్టల రాజనర్సు (72) జ్వరంతో మృతి చెందాడు. రాజనర్సుకు వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానికంగా ఉన్న డాక్టర్లచే చికిత్స చేయించుకున్నాడు. నాలుగు రోజులు గడిచినా జ్వరం తగ్గక పోవడంతో కుటుంబ సభ్యులు శనివారం రాత్రి కరీంనగర్‌కు తరలించారు. అప్పటికే జ్వర తీవ్రత పెరగగా ఇన్‌ఫెక్షన్ అన్ని అవయవాలకు సోకి మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



రాజనర్సు (ఫైల్)

కార్యదర్శిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 21: మండలంలోని జగ్గసాగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈర్నపల్లి ప్రశాంత్‌కుమార్ విధులకు ఆటంకం కలిగిస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... పంచాయతీ కార్యాలయంలో బుధవారం కార్యదర్శి విధులు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన బోజ్జ చిన్నయ్య కార్యాలయానికి వచ్చాడు. తమ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు కట్టడం లేదని పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగిస్తూ చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో పోలీసు స్టేషన్‌లో కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

కోరుట్ల రూరల్, ఆగస్టు 21: మండలంలోని మాదాపూర్‌లో బాలిక అదృశ్యంపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిప వివరాల ప్రకారం... మాదాపూర్ గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక బుధవారం ఉదయం నుంచి కనిపించకుండా పోవడంతో తన తల్లి కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలిక మంగళవారం రాత్రి సమయంలో తల్లితో కలిసి ఇంట్లోనే నిద్రించింది. వేకువ జామున నాలుగు గంటల సమయంలో తల్లి నిద్ర నుంచి లేచి చూడగా తన కుమార్తె కనపడక పోవడంతో తమ సమీప బంధువులకు సమాచారం అదించింది. దీంతో బంధువులు పలు గ్రామాల్లో బాలిక కోసం వెతికారు. బాలిక కనపడక పోవడంతో కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. ఎనుగంటి మూర్తి, అల్లెపు మహేందర్‌తో పాటు మరికొందరు తన కూతురిని అపహరించినట్లు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 21: మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వేగురుపల్లికి చెందిన కనకుంట్ల కార్తీక్ తన భార్య మౌనికతో కలిసి సోమవారం రాఖీ పండగకు అత్తగారి ఊరైన చిన్నకల్వలకు వచ్చాడు. భార్యను వదిలిపెట్టి తిరిగి వేగురుపల్లి వెళ్లిపోయాడు. బుధవారం చిన్నకల్వలకు వచ్చి భార్య ఇంటికి వెళ్దామని చెప్పగా, ఆమె మరుసటి రోజు వెళ్దామని చెప్పింది. దీంతో మనస్థాపానికి గురై పెద్దపల్లి కంచర్‌బావి వద్ద పురుగు మందు తాగాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వ్యభిచార స్థావరంపై దాడి

● ఏడుగురు వ్యక్తులు అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఏసీపీ ప్రకాష్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ఆర్ ప్రకాశ్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 21: జిల్లా కేంద్రంలో జన్మభూమినగర్ ఎల్ఐసీ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పట్టణ పోలీసులు దాడి చేశారు. వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ఐదుగురు విటులను అరెస్టు చేశారు. ఏసీపీ ఆర్ ప్రకాశ్ తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

హమాలీవాడకు చెందిన శ్రీరామోజు కరుణాకర్ అనే వ్యక్తి రెండు నెలల క్రితం ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడని చెప్పారు. రెండు నెలలుగా వ్యభిచార గృహాన్ని నడిపి స్తున్నారన్నారు. దీని నిర్వాహణ కోసం శాతని శంకర్ అనే వ్యక్తిని మేనేజర్‌గా నియమించుకున్నాడని తెలిపారు. శంకర్ గతంలో పట్టణంలోని ఓ లాడ్జిలో పనిచేశాడని, సోషల్ మీడియాలో అమ్మాయిల ఫొటో లను, వారి నంబర్లను తెలుసుకొని వారిని ఇక్కడికి పిలిపించి వ్యభిచారం కొనసాగిస్తున్నారని అన్నారు. విటుడి వద్ద రూ.2వేలు తీసుకొని సగం మహిళలకు ఇచ్చి సగం నిర్వాహకులు తీసుకుంటున్నారని చెప్పారు.

అందులో భాగంగానే వారం క్రితం కరీంనగర్‌కు చెందిన ఓ మహిళ ఫొటోను సోషల్ మీడియా ద్వారా సంపాదించి శంకర్ ఆమెకు ఫోన్ చేశారు. ఆమెకు షార్ట్ ఫిలిమ్స్‌లో అవకాశం కల్పిస్తామని, డబ్బులు కూడా పెద్ద మొత్తంలో ఇప్పిస్తామని మంచిర్యాలకు రావాల్సిందిగా చెప్పాడని అన్నారు.. శంకర్ మాట నమ్మి ఆ మహిళ మంగళవారం రాత్రి మంచిర్యాలకు వచ్చి ఆ ఇంటికి వెళ్లిందని ఏసీపీ తెలిపారు. శంకర్ ఆమె ఫొటోను తనకు తెలిసిన మంచిర్యాల, బెల్లంపల్లి, సీసీసీ నస్పూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, శ్రీరాంపూర్ ప్రాంతాల వారికి పంపించాడన్నారు.

సమాచారం తెలుసుకున్న బెల్లంపల్లికి చెందిన కొప్పర్తి నవీన్, దేవ పోశమల్లు, రామకృష్ణాపూర్‌కు చెందిన గండి రమేశ్ హమాలీవాడకు చెందిన కొలిపాక రాజ శేఖర్, సీసీసీ నస్పూర్‌కు చెందిన గొల్లపల్లి శేఖర్‌లు రాత్రి 10 గంటల సమయంలో గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారని అన్నారు. వారు ఒక్కొక్కరు రూ.2వేల చొప్పున శంకర్‌కు ఇచ్చారని తెలిపారు. శంకర్ వారిని ఆ మహిళకు చూపించి వీరే షార్ట్‌ఫిలిం మేకర్స్ అని పరి చయం చేయించాడని ఏసీపీ చెప్పారు. వీరికి అను కూలంగా ఉంటేనే షార్ట్‌ఫిలింలో అవకాశాలు కల్పి స్తారని శంకర్ చెప్పాడని అన్నారు. అందుకుగాను డబ్బులను కూడా ఇస్తారని ఆమెకు చెప్పగా దీంతో ఆమె అందుకు ఒప్పుకుందన్నారు. సమాచారం తెలిసిన వెంటనే పట్టణ సీఐ బన్సీలాల్ సిబ్బందితో అక్కడికి వెళ్లి వారందరిని అదుపులోకి తీసుకున్నారని ఏసీపీ తెలిపారు. వీరి మొబైల్ ఫోన్లలో ప్రముఖుల నంబర్లు కూడా ఉన్నాయని ఏసీపీ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 21: కొత్తపల్లి మండల పరిధిలోని మార్క్‌ఫెడ్ గోదాం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన కొట్యూరి అజయ్ (33) మృతిచెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. అజయ్ కుటుంబంతో కలిసి చింతకుంటలో నివాసం ఉంటూ సెంట్రింగ్ పనిచేస్తుండేవాడని తెలిపారు. అజయ్ మంగళవారం ఉదయం కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతంలో సెంట్రింగ్‌పనికి వెళ్ళి తిరిగి చింతకుంటకు తన బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వాగులు పొంగితే రాకపోకలు బంద్

● కల్వర్టులు, వంతెనలు లేక జనాల అవస్థలు ● ప్రతిపాదనల దశ దాటని వైనం



వాగు ప్రవాహంతో నిలిచిపోయిన రాకపోకలు

కథలాపూర్, ఆగస్టు 21: ప్రభుత్వాలు మారుతున్నా మారుమూల పల్లె వాసులకు రవాణా సదుపాయాలు మెరుగుపడక పోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయంలో నేతలు రోడ్లు, వంతెనల నిర్మాణాలపై ఇస్తున్న హామీలు నెరవేరకపోవడం వారికి పల్లె వాసులపై ఉన్న చిత్తశుద్ధిని చెప్పకనే చెబుతోంది. ఎన్నో సార్లు తమకు రవాణా మెరుగుపరచాలని విన్న విస్తున్నా నాయకులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉండడమే కాకుండా వంతెనలు, కల్వర్టులు లేక ప్రజలు పడుతున్న కష్టాలు దారుణంగా ఉన్నాయి.

తుర్తి, తక్కళ్లపల్లి వాసుల అవస్థలెన్నో...

చందుర్తి, రుద్రంగి, కొడిమ్యాల, బీమారం మండలాల సరిహద్దుల్లో ఉన్న తుర్తి గ్రామానికి వెళ్లాలంటే అంబారి పేట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ కల్వర్టు నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుంటే రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోవాల్సి వస్తోంది. సమీప అడవుల్లోంచి నీరు పుష్కలంగా ప్రవహిస్తే రోజుల తరబడి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అదేవిధంగా తక్కళ్ళపల్లి-సిరికొండ వంతెన అర్ధాంతరంగా పనులు నిలిచిపోయిన కారణంగా వాగు పొంగితే కథలాపూర్ వైపు రాకపోకలు నిలిచిపోవాల్సిన దుర్గతి పట్టింది.

ఈ వంతెన పనులను కాంట్రాక్టర్‌తో పూర్తి చేయించడంలో పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కల్వర్టులు నిర్మించి, వంతెన పూర్తి చేసి తమ అవస్థలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తక్కళ్లపల్లిలో నుంచి కాలినడకన వస్తున్న యువకులు



తోటి ఖైదీ బెయిల్ ఖర్చుల కోసం చోరీలు..

గోదావరిఖనిలో యువకుడి అరెస్టు



యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21: గోదావరిఖని ప్రాంతంలో తాళం వేసి ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్లలో చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. భూపాలపల్లికి చెందిన దురిశెట్టి స్వామి నిరంజన్ (35) గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలోని మిలీనియం క్వార్టర్స్, టూటౌన్ పరిధిలోని పోతనకాలనీలో దొంగతనాలు చేశాడు. డిగ్రీ పూర్తి చేసిన స్వామి నిరంజన్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తూ పలుమార్లు జైలుకు వెళ్లాడు. నిందితుడిపై 14 కేసులు ఉన్నాయి.

ఒక కేసులో భద్రాచలం సబ్ జైలులో ఉన్న సమయంలో రవీందర్ అనే తోటి ఖైదీతో పరిచ యం ఏర్పడింది. తన భార్య గర్భిణి అని ఎలా గైనా తనను బయటకు తీసుకు రావాలని స్వామి నిరంజన్‌ను రవీందర్ కోరాడు. రవీందర్‌ను బయటకు తీసుకు వచ్చేందుకు అవసరమైన డబ్బు సమ కూర్చుకునేందుకు దొంగతనాలు చేయాలని స్వామి నిరంజన్ నిర్ణయించుకున్నాడు. ఈనెల 9న భద్రాచలం నుంచి గోదావరిఖనికి వచ్చి మిలీనియం క్వార్టర్‌లో తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు తులాల వెండి చోరీ చేశాడు. క్వార్టర్‌ల పార్కింగ్‌లో బైక్‌ను తీసుకుని కొత్తగూడెంకు వెళ్లాడు. వరంగల్ శివారులో బండిలో పెట్రోల్ అయిపోవడంతో అక్కడే వదిలి బస్సులో భద్రాచలం చేరుకున్నాడు. చోరీ చేసిన నగలను కొత్తగూడెంలోని ఫైనాన్స్‌లో కుదువపెట్టి వచ్చిన డబ్బులతో లాయర్‌ను మాట్లాడి రవీందర్‌కు బెయిల్ వచ్చేలా ఏర్పాట్లు చేశాడు. చోరీ చేసిన డబ్బులు అయిపోవడం, మళ్లీ డబ్బులు అవసరం పడడంతో స్వామి నిరంజన్ మళ్లీ దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 14న పోతనకాలనీలో సింగరేణి క్వార్టర్‌లలో రెక్కీ నిర్వహించి, చాలా క్వార్టర్‌లకు తాళాలు వేసి ఉండడాన్ని గమనించాడు.

అర్ధరాత్రి 12 గంటలకు ఒక క్వార్టర్ తాళం పగులగొట్టి రూ.5500 నగదు, మరో క్వార్టర్‌లో ఎనిమిది తులాల వెండితో పాటు ఫాస్ట్ ట్రాక్‌వాచ్, బ్లూటూత్ హెడ్‌సెట్ చోరీ చేశాడు. క్వార్టర్స్ పార్కింగ్ స్థలంలో ఉన్న బైక్‌ను చోరీ చేసి కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో చుంద్రుగొండ వద్ద బైక్ పాడవడంతో అక్కడే వదిలి పారిపోయాడు. తిరిగి చోరీ చేయడానికి బుధవారం పోతనకాలనీకి వచ్చిన స్వామినిరంజన్ పోలీసులకు పట్టుబడ్డాడు. టూటౌన్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై అటువైపు వచ్చిన స్వామి నిరంజన్ పోలీసులను చూసి తప్పించుకోబోగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో చోరీ కేసును తక్కువ సమయంలో ఛేదించి, చోరీలకు పాల్పడిన స్వామినిరంజన్‌ను పట్టుకున్న ఎస్సై వెంకటేష్, కానిస్టేబుల్ రమేష్, భార్గవ్, ప్రవీణ్, వెంకటేష్‌లను సీఐ అభినందించారు.

ఓటరు నమోదును పూర్తి చేయాలి

వీర్నపల్లి, ఆగస్టు 21: గ్రామాలలో వార్డుల వారీగా ఓటరు నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని డిఎల్పీఓ జోగం రాజు అన్నారు. వీర్నపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఓటర్ నమోదుపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ నమో దు ప్రక్రియను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాలలో ఎల్ఆర్ఎస్, సిటిజన్ సర్వీస్ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సిబ్బందిచే పారిశుధ్య కార్యక్రమాలను ప్రతిరోజు నిర్వహించాలని సూచించారు.

హెల్త్ సబ్ సెంటర్ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ

బోయినపల్లి, ఆగస్టు 21: ప్రజలందరికీ అందుబాటులో అన్ని వైద్య సేవలు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలం కోరెం గ్రామంలో రూ 20 లక్షలతో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు, డీఎంహెచ్ఓ వసంతరావు, సెస్ డైరెక్టర్ కోట్రేపల్లి సుధాకర్, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ, పులి లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు

రుణమాఫీ సగం కూడా కాలేదు

- నాఫ్స్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట ఆగస్టు 19: కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడుదలగా చేసిన రుణమాఫీ సగం కూడా కాలేదని నాఫ్స్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొండూరి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు అర్హులైన అన్నదాతల రుణాలు మాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులు బ్యాంకులు, సహకార సంఘాలకు, రైతు వేదికల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. అర్హులైన రైతులకు రుణమాఫీ చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు.

కొలనూరులో ఆయుర్వేద వైద్య శిబిరం

కోనరావుపేట, ఆగస్టు 21 : కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో బుధవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి కళ్యాణి మాట్లాడుతూ ఆయుర్వేద మందులతో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్ ఉండవని అన్నారు. వృద్ధులు ఎక్కువ శాతం ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఈ శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి మందులను అందజేస్తామని అన్నారు. ప్రోగ్రాం అధికారి తిరుపతి ఫార్మసిస్ట్ ప్రణీత, వైద్య సిబ్బంది సరోజ పాల్గొన్నారు.

25న టీయూడబ్ల్యూజే ఆత్మీయ సమావేశం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: ఈ నెల 25న వేములవాడలోని ఎస్ఆర్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించనున్న ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీయూడబ్ల్యుజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మహేశ్, మజీద్, బాల్‌రెడ్డి, జగదీష్ రవి, బాబు, షరీఫ్, అనిల్ ఉన్నారు.

● వీర్నపల్లి: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐజేయు(టీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో సమావేశం నిర్వహించారు. 25న వేములవాడలోని ఎస్ఆర్ఆర్ గ్రాండ్ హోటల్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్, జిల్లా జాయింట్ సెక్రటరీ అరుణ్ కుమార్, ఈసీ మెంబర్ శంకర్, జర్నలిస్టులు వేటూరి సతీష్, గుగులోతు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రుద్రంగి (చందుర్తి)ఆగస్టు 21: రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ద్వితీయార్థంలో భాగంగా స్వామి వారికి బుధవారం, శనివారాల్లో బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో భక్తులు సంఖ్యలో పాల్గొని స్వామివారి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమిరే శంకర్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

రుద్రంగి (చందుర్తి) ఆగస్టు 21: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. ఒకటవ సబ్ సెంటర్‌లో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమలతో జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అర్చన, లక్ష్మమ్మ,రత్నమాల సుమలత, అంగన్వాడీలు మంజుల, జ్యోతి, సరిత, బాలింతలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఎదుట ఏబీవీపీ ధర్నా

తంగళ్లపల్లి, ఆగస్టు 17: రాఖీ పండుగను అడ్డుకున్న ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు గురుకుల పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ముందు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అక్కేం నాగరాజు మాట్లాడుతూ రాఖీ సందర్భంగా విద్యార్థులు తన సోదరులకు రాఖీ కట్టడానికి అనుమతించని ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై సుధాకర్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని ఏబీవీపీ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విభాగ్ లా ఫోరమ్ కన్వీనర్ సామనపెల్లి ప్రశాంత్, రాజు, శ్రీనివాస్ ధనుష్, పవన్, విష్ణు రవీందర్, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు

రాజన్న సేవలో బలగం మూవీ డైరెక్టర్



వేణును సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 21: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని బుధవారం బలగం సినిమా డైరెక్టర్ వేణు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన స్వామివారలను దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి శ్రీస్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 21: రైతులందరి రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి, ఆగస్టు21: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ శంకరమ్మ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో గ్రామపోషణ, ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం పుష్పలత తల్లులకు ఆరోగ్యం పరిశుభ్రత పై అవగాహన కల్పించారు.

గైనకాలజిస్టుని నియమించాలని వినతి

వేములవాడ టౌన్, ఆగస్టు 21: వేములవాడ ఏరియా ఆసుపత్రికి పూర్తిస్థాయిలో గైనకాలజిస్టు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారని వెంటనే గైనకాలజిస్టును నియమించాలని పట్టణ బీజేపీ శాఖ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏరియా ఆసుపత్రిని సందర్శించి సూపరిండెంట్ పెంచలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హన్మాండ్లు, అక్కనపెల్లి వివేకొరెడ్డి, జగన్నాథం శ్రీనివాస్, నేరేళ్ల సాయి, మైలారం శ్రీనివాస్, మేరుగు లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న నాయకులు



ఇల్లంతకుంటలో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు



వేములవాడలోని కళాశాలలో బంద్ చేపిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం భారత్ బంద్‌లో భాగంగా సిరిసిల్ల పట్టణం బంద్ పాక్షికమైంది. ఉదయం తెల్లవారు జామున మాలల పోరాట ఐక్య వేదిక జిల్లా నాయకులు సిరిసిల్ల ఆర్టీసీ డిపో వద్ద బస్సులు బయటకు రాకుండా డిపో ముందు బైఠాయించడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ మాలల పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం పట్టణ ప్రధాన రహదారుల గుండా జిల్లా కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాలల పోరాట ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్ మాట్లాడారు. రాజ్యాంగ వ్యతిరేకంగా ఇచ్చి ఎస్సీ ఉప వర్గీకరణ తీర్పును సుప్రీంకోర్టు వెంటనే రీకాల్ చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీల హక్కుగా ఉన్న రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మాలల ఐక్య వేదిక జిల్లా కో కన్వీనర్లు నాలుక సత్యం, జక్కుల యాదగిరి, బూర యాదగిరి, బొల్లం గణేష్, రాష్ట్ర నాయకుడు మేడి అంజయ్య, నాయకులు అంగూరి రంజిత్, సుధాకర్, నాంపెల్లి, హరీష్, సంపత్‌కుమార్, నరేష్, సాయిచంద్, రవివర్మ, సురేష్, గణేష్, రవీందర్, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మాలమహానాడు ఇచ్చిన బంద్‌కు మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు వ్యాపార సంస్థలను బుధవారం మూసివేయించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ మామిడి సంజీవ్, నాయకులు చాతర్ల రాజు, చాతర్ల బాబు, మామిడి శేఖర్, న్యాత అనీల్, మామిడి హరీష్, మహేందర్, మామిడి శేఖర్, పర్శరాం, రాజెల్లం, చందు, లక్ష్మన్, రాజు, స్వామి, న్యాత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన భారత్ బంద్ ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఆ సంఘాల నాయకులు మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, తదితర గ్రామాల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాచర్లగొల్లపల్లిలోని బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజుకుమార్, రామచంద్రం, మధు, దాసు, దేవయ్య, సందీప్, జగన్, భాను, శ్రీనివాస్, రవి, దేవరాజు, జితేందర్, హరీష్, సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి:వర్గీకరణను వ్యతిరేకిస్తూ అంబేద్కర్ యువజన సంఘం, మాల మహానాడు ఐక్యవేదికల ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండల కేంద్రంలో వాణిజ్య వ్యాపార సంస్థలను బంద్ చేయించారు. అనంతరం సిరిసిల్ల సిద్దిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

● గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మాల మహానాడు ఇచ్చిన బంద్ పిలుపు బుధవారం విజయవంతం అయింది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు సంపూర్ణంగా బంద్‌పాటించాయి. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, ఎస్సీ వర్గీకరణ సమితి జిల్లా నాయకులు మల్యాల రాజవీర్, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు బండ రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో ఇచ్చిన భారత్ బంద్ కోనరావుపేట మండలంలో బుధవారం విజయవంతమైంది. మాల మహానాడు నాయకులు బందులో పాల్గొని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను, దుకాణాలను బందు చేశారు. మాల మహానాడు నాయకులు శ్రీనివాస్. అంగూరి సుధాకర్, మాదాసు భూమయ్య, పరుశరాములు, రమేష్, సురేష్, రాజశేఖర్, చంద్రయ్య, సదానందం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన భారత్‌బంద్ ముస్తాబాద్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. వర్గీకరణ రాబోయే తరాలకు రిజర్వేషన్ లేకుండా చేస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగమే వర్గీకరణ అని అన్నారు.

● వీర్నపల్లి : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా మాలల ఐక్యవేదిక ఇచ్చిన భారత్ బంద్ విజయవంతం అయిందని మండల కమిటీ బాధ్యులు పాటి దినకర్ అన్నారు. మండల కేంద్రంలో స్వచ్ఛందంగా బంద్ పాటించిన అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణ బిల్లును వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగదన్నారు. మాల ఐక్య వేదిక నాయకులు జంగం అంజయ్య, మల్లేశం, రాజు పాల్గొన్నారు.

● చందుర్తి: ఎస్సీ, ఎస్టీలను వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మాల మహానాడు ఇచ్చిన బందు పిలుపు మేరకు మండలంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా మాల మహానాడు సంఘం నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ అనేది రాబోయే తరాలకు రిజర్వేషన్లు లేకుండా చేస్తుందన్నారు. వర్గీకరణ అనేది దేశంలోని ఎస్సి, ఎస్టి ప్రజలకు ప్రమాదకరమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రంగా ప్రభావం చూపుతుందన్నారు.భారత్ బంద్‌కు సహకరించిన మండలంలోని విద్యా సంస్థలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు మండల అధ్యక్షులు నీరటి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల కమలాకర్, మాల ఐక్యవేదిక మండల ఇంచార్జ్ బత్తుల ఉదయ్ కుమార్, నాయకులు సంటి ప్రసాద్, మేడికాల తిరుపతి,పురుగుల సతీష్, బత్తుల జ్యోతి కుమార్, రాగుల రత్నం, బత్తుల వంశీ, మ్యాకల తిరుపతి, గొంటి మనోజ్, నవీన్, చంటి,వాసు ఆయా గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

● వేములవాడ : ఎస్సీ వర్గీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కోరుతూ మాలమహానాడు ఇచ్చిన బంద్ లో భాగంగా బుధవారం నాడు వేములవాడ పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థలను మూసివేశారు. బందుకు మద్దతుగా విద్యాసంస్థలు మూసివేయాలని మాల మహానాడు నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు పలు విద్యా సంస్థల నిర్వాహకులు పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. విద్యాసంస్థలు మూసివేయాలని కోరుతూ అక్కడకు చేరుకున్న మాల మహానాడు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు గుర్రం తిరుపతి, పిట్టల సతీష్, రొండి రాజు, సంటి మహేష్, గుర్రం రాంబాబు, పిట్టల నరేష్, పిట్టల వెంకటేష్, నిరటి తిరుమల్ తదితరులు ఉన్నారు.



గంభీరావుపేటలో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు



తంగళ్లపల్లిలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు



చందుర్తిలో బందు పాటిస్తున్న మాల మహానాడు నాయకులు

25న మెగా జాబ్‌మేళా

వేములవాడ, ఆగస్టు 21: ఈనెల 25వ తేదీన వేములవాడలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించిన పోస్టరును బుధవారం ఆయన వేములవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 25 తేదీన వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో చేపట్టనున్న మెగా జాబ్‌మేళాను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.నిరుద్యోగ, యువతీయువకులు ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైదరాబాద్ నుంచి సుమారు 50కి పైగా కంపెనీలు వస్తున్నాయని ఎంపిక అయిన వారికి అదేరోజు నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో యువతకు తోడ్పాటు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

ముస్తాబాద్, ఆగస్టు 21: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు చేసే ల్యాబ్, ఫార్మసీ, వాక్సినేషన్ గదులను పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి ప్రతిరోజు ఎంతమంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని వైద్య పరీక్షలు అందించాలని ఆదేశించారు. అక్కడి నుంచి ఆయన గూడెం గ్రామం చేరుకొని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అక్కడే సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల సర్వే నిర్వహించాలన్నారు. అన్ని రకాల సీజనల్ వ్యాధులకు రక్త పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేసేలా కావలసిన కిట్లు, పరికరాలు అందజేస్తామని పేర్కొన్నారు. కుక్కలు, కోతుల దాడులతో వచ్చే రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. ఇందులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని గీతాంజలి, సిబ్బంది ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 21: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారిని నిత్యం పర్యవేక్షించాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలో నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గోపాల్ నగర్ ప్రాథమిక పాఠశాలలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎ. రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో నిత్యం విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని పాఠ్యాంశాలు చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నేరుగా తరగతి గదిలోకి వెళ్లి పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి, ఎందరు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం తయారు చేసే గదిని పరిశీలించి, నిర్వాహకురాలితో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. విద్యార్థులకు ప్రతి సబ్జెక్టుపై అవగాహన వచ్చేలా బోధించాలని, ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, చదవడం, రాయడం, గణితం ఇంగ్లీష్ అంశాల్లో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట సెక్టోరియల్ అధికారి శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.



నెహ్రూనగర్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో

సర్టిఫికెట్ జారీలో నిర్లక్ష్యం వహిస్తున్నారని నిరసన

బోయినపల్లి, ఆగస్టు 21: జిల్లా కలెక్టర్ ఆదేశించినా సర్టిఫికెట్ జారీ చేయడంలో తహసీల్దార్, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నీలోజిపల్లి గ్రామానికి చెందిన కూస శ్రీనివాస్ అతని భార్య శైలజ ఇటీవల గ్రూప్-4 పోటీ పరీక్షల్లో ఎంపికైంది. శైలజ గతంలో ఒకటి నుంచి మూడో తరగతి వరకు నీలోజిపల్లిలోని గుర్తింపు లేని పాఠశాలలో విద్యాభ్యాసం చేసింది. దీంతో బాధితురాలు భర్త కుస శ్రీనివాస్ స్టడీ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో మూడు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. సమస్య పరిష్కారం కాక కలెక్టర్‌ను కలిసి వేడుకున్నాడు. విచారణ జరిపి సర్టిఫికెట్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించినా తహసీల్దార్ సర్టిఫికెట్ జారీ చేయడంలో మూడు నెలలుగా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసనకు దిగాడు. తన భార్యకు స్టడీ సర్టిఫికెట్ అందించాలని ఉన్నతాధికారులను కోరాడు. కలెక్టర్ ఆదేశించినా సర్టిఫికెట్ జారీ చేయని తహసీల్దార్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు డిమాండ్ చేశాడు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 21: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని అక్టోబరు 14నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ ప్రకటించారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం ఏఐటీయూసీ తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులు తరలివచ్చి కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 22 సంవత్సరాల నుంచి మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన రోజు నుంచి కార్మికులు వంటలు చేస్తున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీ ప్రకారం సమస్యలను పరిష్కరించాలని లేకుంటే నిరవధిక సమ్మె చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు నడిగొట్టు లక్ష్మీ, కడారి రాములు, సంతోష, విజయ, తారవ్వ, పోషవ్వలక్ష్మీ, కౌసల్య, జూబేదా, మణెవ్వ, లచ్చవ్వ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● వీర్నపల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు మల్లారపు అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో సిఐటియు అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మల్లారపు దేవయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఎన్ని మారినా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. కార్మికులకు సంబంధించిన వెల్ఫేర్ బోర్డులో ఉన్న డబ్బులను ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. వెల్ఫేర్ బోర్డులో ఉన్న ప్రతి పైసా కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుంటుకు నరేందర్, నాయకులు బూస రాజం, గంగిపల్లి అంజయ్య, రాజు, వెంకటేష్, నర్సయ్య, జాఫర్, చందు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. అంతే!



కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రహదారి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 21: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి వీర్నపల్లికి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలు, కోతలకు గురై ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రంతో పాటు అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని వంతెనల వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టకపోవడం వల్ల గుంతలమయంగా తయారైంది. దుమాల ఎల్లమ్మ ఆలయం సమీపంలోని వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. గుంతలు, కోతల వల్ల ప్రయాణానికి కష్టతరంగా మారింది. వాహనాలపై వెళ్లేందుకు ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. అదుపు తప్పితే.. ఆసుపత్రి పాలవుతామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేయాలని కోరుతున్నారు.